క్లుప్తంగా

ఎన్ఎస్‌యూలో సండేస్ ఆన్ సైకిల్


సైకిల్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న వీసీ

తిరుపతి సిటీ: కేంద్ర యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ, ఇండియన్ యూనివర్సిటీస్ అసోసియేషన్, విద్యా మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఫిట్‌నెస్, సస్టైనబిలిటీ, కమ్యూనిటీ స్పిరిట్‌ను ప్రోత్సహిస్తూ ఆదివారం జాతీయ సంస్కృత వర్సిటీలో సండేస్ ఆన్ సైకిల్ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సైకిల్ ర్యాలీని వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనశైలి, పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు కమ్యూనిటీ స్పిరిట్‌ని ప్రోత్సహించడమే కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ సెక్రటరీ వి.సేతురాం, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నీలం సంజీవరెడ్డికి ఘన నివాళి


నీలం సంజీవరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వర్సిటీ అధికారులు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం వర్సిటీలోని ఆయన విగ్రహానికి వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ ఎస్వీయూ స్థాపనలో కీలక పాత్ర పోషించడంతో పాటు రాయలసీమ విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేసిన దార్శనీకుడు నీలం సంజీవరెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మీడియా డీన్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు, ఇంచార్జి ఇంజినీర్ తాండవ కృష్ణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

తిరుపతి తుడా: వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, 9.30 నుంచి 10.30 గంటల వరకు నిర్వహించే డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో ఫోన్ ద్వారా ఫిర్యాదులు చేసేవారు 0877–2227208కి కాల్ చేసి మాట్లాడవచ్చని తెలిపారు.

బీసీల సత్తా చాటుదాం


సన్నాహక సమావేశంలో ఐక్యత చాటుతున్న బీసీ సంఘాల నేతలు

తిరుపతి కల్చరల్: హక్కుల సాధనే లక్ష్యంగా ఈ నెల 22న తిరుపతిలో జరగనున్న బీసీ ఆత్మగౌరవ భరోసాకు వేలాదిగా తరలి వచ్చి సత్తా చాటాలని బీసీ సంఘాల నేతలు పిలుపునిచ్చారు. బీసీ ఆత్మగౌరవ భరోసా సభ విజయవంతాన్ని కాంక్షిస్తూ ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరి నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం పెద్దకాపు వీధిలోని ఓ ప్రైవేటు హోటల్లో ఆత్మగౌరవ సన్నాహక సమావేశం నిర్వహించారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజ గౌడ్ మాట్లాడుతూ బీసీల సంక్షేమమే లక్ష్యంగా హక్కుల సాధనకై ఈ నెల 22న తిరుపతి ఇందిరా మైదానంలో బీసీ ఆత్మగౌరవ భరోసా సభ చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీ నేత ఆల్‌మెన్‌రాజు, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ఉమాపతి ఆచారి, బీసీ సాధికారిత సమాఖ్య అధ్యక్షుడు తులసీరాం, బీసీ సంఘర్షణ సమితి అధ్యక్షుడు అక్కినపల్లి లక్ష్మయ్య, నాయీబ్రాహ్మణ సంఘం నేత బుజ్జిబాబు, బీసీ సంఘ నేతల సోమశేఖర్, నాగేంద్ర, బీసీ ఉద్యోగ సంఘం నేతలు పాల్గొన్నారు.

దాడి చేసిన నిందితుల అరెస్టు

చంద్రగిరి: దళిత బీటెక్ విద్యార్థి అనపల్లి జేమ్స్‌పై దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసినట్లు తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం పత్రికా ప్రకటనను విడుదల చేశారు. గత నెల 14వ తేదిన శ్రీవిద్యానికేతన్‌లో బీటెక్ చదువుతున్న జేమ్స్, అతని సహ విద్యార్థి గురుసాయిరెడ్డిపై మంగళం సమీపంలోని ఎస్వీసీఈ కళాశాల సమీపంలో పూర్వ విద్యార్థి యశ్వంత్ తదితరులు దాడికి పాల్పడినట్లు తెలిపారు. ఆపై వారిని కిడ్నాప్ చేసి, తిరుపతి పద్మావతిపురం సమీపంలోని ఓ లాడ్జిలో నిర్బంధించి చిత్రహింసలకు గురి చేసినట్లు ఫిర్యాదు అందిందన్నారు. ఈ మేరకు ఎస్ఐలు సాయినాథ్ చౌదరి, జగన్నాథరెడ్డి, రామకృష్ణ, రాఘవేంద్ర ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందుతుల కోసం గాలింపు చేపట్టామన్నా. దాడికి పాల్పడిన యశ్వంత్, లలిత్‌గోపాల్, చరణ్ సాయి రెడ్డి, అఖిల్, సాయి కిరణ్ రెడ్డి జశ్వంత్ శెట్టి, హరీష్, వినోద్, కౌశిక్, శ్రీనివాస మౌర్య, సాయి అలియాస్ సంతోష్, హరిలను అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఎడతెగని నిరీక్షణ



యోగిమల్లవరం రేషన్ షాపు ముందు వరుసలో బ్యాగులు, చంద్రగిరి: అక్కగార్లకాలనీ వద్ద రేషన్ బియ్యం కోసం సంచులను క్యూలో ఉంచిన లబ్ధిదారులు

రేషన్ కోసం వచ్చే కార్డుదారులకు కష్టాలు తప్పడం లేదు. మండుతున్న ఎండలకు తోడుగా సర్వర్ కష్టాలు వెన్నంటి రావడంతో బియ్యం కోసం గంటల తరబడి కాచుకుని కూర్చునే పరిస్థితి. గత ఐదేళ్లలో ఎప్పుడూ ఇలా బియ్యం కోసం వేచి చూడలేదని, గంటల తరబడి క్యూలో నిలబడలేక సొమ్మసిల్లి కిందపడుతున్నట్లు కార్డుదారులు చెబుతున్నారు. అసలు బయో మెట్రిక్ అన్నదే లేకుండా చేసి సంతకం పెట్టి బియ్యం తీసుకునే అవకాశం కల్పించాలని కార్డుదారులు కోరుతున్నారు. ఎప్పుడు వచ్చినా సర్వర్ పని చేయడం లేదని, వేలిముద్రలు రావడం లేదని గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి వస్తోంది. రేషన్ పంపిణీలో గత ప్రభుత్వమే మేలు అనిపిస్తోంది.. ఇంటి ముందుకు వచ్చి బియ్యం ఇచ్చేవారు.. అంటూ పలువురు మహిళలు స్పష్టం చేస్తున్నారు.

– తిరుపతి రూరల్

- వరుసలో బ్యాగులు.. నీడలో మనుషులు
- గంటల తరబడి వేచి ఉన్నా దొరకని బియ్యం
- కార్డుదారులకు తప్పని రేషన్ కష్టాలు
- సర్వర్ పనిచేయకపోవడంతోనే అంటున్న డీలర్లు
- బయోమెట్రిక్‌పై భగ్గుమంటున్న కార్డుదారులు

తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు పంచాయతీ యోగిమల్లవరం వద్ద ఓ రేషన్ దుకాణం ముందు క్యూలో నిలబడలేక, ఎండ తీవ్రతను తట్టుకోలేక ఇద్దరు మహిళలు సొమ్మసిల్లి కింద పడ్డారు. ఆ ఇద్దరినీ రేషన్ షాపు డీలర్ వాసు ఆటోలో ఆసుపత్రికి పంపించారు. దీంతో కార్డుదారులు కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబడుతూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 800 కార్డులు కలిగియున్న ఆ రేషన్ షాపులో సకాలంలో సరుకులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని, అయితే సర్వర్ పనిచేయకపోవడంతో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని కార్డుదారులు చెబుతున్నారు. ఎండ తీవ్రత అధికం కావడంతో క్యూలో నిలబడాల్సిన మనుషులు నీడ పాటుకు చేరుకుని తమ వెంట తెచ్చుకున్న బ్యాగులను వరుసలో పెట్టారు. తమ వంతు వచ్చినపుడు డీలరు వద్దకు వెళ్లి వేలి ముద్ర పెట్టి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. అయితే ఉదయం 8 గంటల నుంచి 9.30 గంటల వరకు మాత్రమే పనిచేసిన సర్వర్ ఆ తరువాత 12గంటల వరకు పనిచేయలేదు. కేవలం ఒకటిన్నర గంట మాత్రమే సర్వర్ పనిచేయడంతో 30 మందికి బియ్యం సరఫరా చేయగలిగామని, ఆ తరువాత ఎంత సేపటికీ సర్వర్ పనిచేయకపోవడంతో బియ్యం ఇవ్వలేకపోయామని డీలర్ వాసు వివరించారు. గత ప్రభుత్వంలో తమ వీధుల్లోకి వచ్చే రేషన్ బండి వద్ద తీసుకునేందుకు ఏ మాత్రం ఇబ్బంది ఉండేది కాదని, ఇప్పుడు మళ్లీ పాత పద్ధతి తీసుకురావడంతోనే తమకు రేషన్ కష్టాలు వచ్చాయని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఇలాంటి పనికిమాలిన నిర్ణయాలు తీసుకుని ప్రజలను వేధించడం భావ్యం కాదని మండి పడుతున్నారు.

రేషన్‌తో పరేషాన్

చంద్రగిరి: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తి అయిన సందర్భంగా ఇంటింటికీ రేషన్ విధానాన్ని రద్దు చేసింది. ప్రతి ఒక్కరూ రేషన్ డీలర్ వద్దకు వెళ్లి బియ్యం పొందాలని ఆదేశాలను జారీ చేసింది. దీంతో మొదటి రోజు ఆదివారం సీఎం చంద్రబాబు సొంత మండలంలో రేషన్ పొందేందుకు ప్రజలు పెద్ద ఎత్తున క్యూ కట్టారు. ఉదయం 8 గంటల నుంచి రేషన్ దుకాణాల వద్దకు ప్రజలు క్యూ కట్టడంతో గందరగోళం ఏర్పడింది. చంద్రగిరిలోని భారతీ నగర్, బీడీ కాలనీలలో ప్రజలు రేషన్ కోసం పెద్ద ఎత్తున వేచి ఉన్నారు. తొలుత సజావుగా సాగిన రేషన్ పంపిణీ గంట తర్వాత సర్వర్లు మొరాయించడంతో నిరీక్షించాల్సి వచ్చింది. పనపాకంలో సర్వరు పనిచేయకపోవడంతో లబ్ధిదారులు వెనుదిరిగారు. తూర్పుపల్లిలో సర్వర్ సమస్యతో ప్రజలు మండిపడ్డారు. నరసింగాపురంలో ఉదయం 10 గంటలైనా రేషన్ దుకాణం తెరుచుకోకపోవడంతో స్థానిక ప్రజలు మండిపడ్డారు. సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో స్పందించిన అధికారులు ఆగమేఘాలపై రేషన్ పంపిణీని ప్రారంభించారు.

వృద్ధులను ఇబ్బంది పెట్టొద్దు



నాకు 5 కేజీల బియ్యం కార్డు ద్వారా వస్తుంది. ఇందు కోసం ఉదయం 9 గంటల నుంచి దుకాణం వద్ద వేచి ఉన్నాను. ఒకరిద్దరికి బియ్యం ఇచ్చిన తర్వాత సర్వరు పని చేయడం మానేసింది. సుమారు గంట నుంచి ఇక్కడ వేచి ఉన్నాను. ఇప్పటి వరకు సర్వరు అందుబాటులోకి రాలేదు. ఇంటి వద్దకే వచ్చి బియ్యం ఇవ్వడమే బాగుండేది. ఇప్పుడు వృద్ధులను ఇబ్బంది పెట్టేలా దుకాణానికి వచ్చి తీసుకోవడం దారుణం.

– జయలక్ష్మి, శ్రీనివాసులుశెట్టి వీధి, చంద్రగిరి

మూడు గంటలుగా నిలబడి ఉన్నాం

రేషన్ బియ్యం కోసం ఉదయం 9గంటలకు వచ్చాను. ఇప్పుడు 12 గంటలు అవుతోంది. ఇంత వరకు బియ్యం చేతికి రాలేదు. అన్నం టైం అయ్యింది. ఇంటికి వెళ్లి ఎప్పుడు అన్నం, కూర చేయాలి. పిల్లలు, పెద్దలకు పెట్టాలి. ఇప్పటికీ సర్వర్ పనిచేయలేదని చెబుతున్నారు.

– వల్లెమ్మ, యోగిమల్లవరం

రెండు గంటలుగా సర్వర్ పనిచేయడం లేదు

రేషన్ తీసుకోవడానికి వచ్చాను. రెండు గంటలుగా సర్వర్ పని చేయడం లేదు. గతంలో ఒక్కొక్క ఏరియాకు సర్వర్ పనిచేసేలా అవకాశం ఇచ్చి.. మిగతా ఏరియాల్లో సర్వర్ ఆపేసేవాళ్లు. దాని వల్ల త్వరగా అందరికీ బియ్యం ఇవ్వగలిగేవారు. దానివల్ల ఎప్పుడు ఇలా గంటల తరబడి ఎండలో నిలబడలేదు. ఇప్పుడు నరకం కనబడుతోంది.

– హేమలత, ప్రశాంతి నగర్

బయోమెట్రిక్ ఎత్తివేయాలి

రేషన్ షాపుల్లో బయోమెట్రిక్ ఎత్తివేయాలి లేదా గత ప్రభుత్వంలో ఇంటి వద్దకు బండి పంపినట్టు వాహనాల్లో ఇళ్లకే బియ్యం తెచ్చి ఇవ్వాలి. అలా కాకుండా గంటల కొద్దీ క్యూలో నిలబడమంటే మా వంటి ముసలోళ్లు ఎలా రావాలి, ఎలా తీసుకోవాలి. మూడు గంటలుగా ఇక్కడే వున్నాం. అన్నం ఎప్పుడు చేసుకోవాలి. ఎప్పుడు తినాలి. – దేవయానమ్మ, కాపువీధి

బియ్యం కోసం వస్తే నీరసం వస్తోంది

బియ్యం కోసం ఉదయం 9గంటలకు వచ్చాను. బియ్యం అయితే ఇవ్వలేదు కానీ నీరసం వచ్చి కింద పడిపోయే పరిస్థితి ఉంది. ఇప్పటికే ఇద్దరు మహిళలు కిందప డిపోతే డీలరు వాసు అన్న వారిని ఆటోలో ఆసుపత్రికి పంపారు. ఆ బియ్యం లేకున్నా ఫర్వాలేదు. ప్రాణాలుంటే చాలు అనిపిస్తోంది.

– లక్ష్మి, యోగిమల్లవరం



చంద్రగిరిలో సర్వర్లు పనిచేయకపోవడంతో చౌక దుకాణం వద్ద రేషన్ బియ్యం కోసం వేచి ఉన్న మహిళలు



నరసింగాపురంలో ఉదయం 10 గంటలైనా తెరుచుకోని చౌక దుకాణం, భారతీ నగర్‌లో పోటెత్తిన కార్డుదారులు

భూమన కుటుంబానికి రుణపడి ఉంటా..


భూమన కరుణాకరరెడ్డి, అభినయ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న తమ్ముడు గణేష్

- వైఎస్ఆర్ సీపీ వలంటీర్స్ విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ తమ్ముడు గణేష్

తిరుపతి మంగళం: పార్టీ బలోపేతం కోసం శ్రమించే వారికి తగిన గుర్తింపు లభిస్తుందనడానికి తానే నిదర్శనమని, తనను 3వ డివిజన్ కార్పొరేటర్‌గా గెలిపించడమే కాకుండా వైఎస్ఆర్ సీపీ వలంటీర్స్ విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీగా పదోన్నతి కల్పించిన భూమన కుటుంబానికి రుణపడి ఉంటానని తమ్ముడు గణేష్ అన్నారు. వైఎస్ఆర్ సీపీ వలంటీర్స్ విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీగా నియమితులైన తమ్ముడు గణేష్ ఆదివారం చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్ఆర్ సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డిలను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

నోటీస్ బోర్డు

- తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం.
- శ్రీగోవిందరాజస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 7.02 నుంచి 7.20 గంటల మధ్య ధ్వజారోహణం, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు పెద్ద శేషవాహన సేవ.
- జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల నుంచి సమస్యల స్వీకరణ.
- వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో విన్నర్ వరల్డ్ రికార్డు నమోదుకై యూత్ హాస్టల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జయహో జానపదం కార్యక్రమం.

శాస్త్రీయ సమాజానికి దోహదపడండి


ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేవీవీ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: వైద్యులు, ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లు, న్యాయవాదులు, వివిధ రంగాల నిపుణులు, విద్యార్థులు, యువత, మహిళలు, మేధావులు జన విజ్ఞాన వేదిక సభ్యత్వంతో శాస్త్రీయ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని జేవీవీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మురళీధర్ పిలుపునిచ్చారు. యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఆయన జన విజ్ఞాన వేదిక సభ్యత్వ ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం నుంచి జన విజ్ఞాన వేదిక సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రముఖ రచయిత్రి డాక్టర్ మస్తానమ్మ మాట్లాడుతూ ప్రజలు శాస్త్రీయ ఆలోచనలతో జీవించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకర రెడ్డెప్ప, జేవీవీ కార్యకర్తలు బిర్లా నాయుడు, లక్ష్మీనారాయణ, రఫీ, ఇమామ్, సభ్యులు జయచంద్ర, బాలాజీ, నాగార్జున, ముఖేష్, మునిరాజ, నారాయణ, ప్రసూన పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీగోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలు



స్వామివారి ఉత్సవాల ఆరంభం సందర్భంగా సేనాధిపతి ఉత్సవం, ఆలయ ఆవరణలో విద్యుద్దీపాలంకరణ

- ఉత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజ స్వామివారి ఆలయంలో ఈనెల 2వ తేదీ సోమవారం నుంచి 10వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వేడుకగా జరుగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను టీటీడీ పూర్తి చేసింది. స్వామి వారి బ్రహ్మోత్సవాలకు ఆదివారం సాయంత్రం 5.30 నుంచి 8 గంటల మధ్య శాస్త్రోక్తంగా అంకురార్పణ చేపట్టారు. పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ డెప్యూటీ ఈఓ వీఆర్.శాంతి, ఏఈఓ కె.మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిరోజైన సోమవారం ఉదయం 7.02 నుంచి 7.20 గంటల మధ్య మిథున లగ్నంలో ధ్వజారోహణం నిర్వహిస్తారు. శ్రీగోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతి రోజు ఉదయం 7 నుంచి 9 గంటల వరకు, తిరిగి రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామివారి వాహన సేవలు జరుగనున్నాయి.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


కళాకారుల నృత్య ప్రదర్శన

చంద్రగిరి: తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం తిరుపతికి చెందిన కీర్తి నృత్యాలయ ఆధ్వర్యంలో నాట్యాచార్యులు రాచంరెడ్డి కీర్తి పర్యవేక్షణలో శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. వివిధ పాటలకు కళాకారులు కీర్తి, ప్రాధాశ్వర రెడ్డి, దిషిత రెడ్డి, సాయిరూపిక చూడచక్కని హావభావాలతో నాట్యం చేశారు. వారి అభినయానికి మంత్రముగ్ధులైన ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో అభినందనలు తెలిపారు. అనంతరం ఏఓ సుధాకర్ కళాకారులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

మైనారిటీ సెల్ అధ్యక్షుడికి ఘన సన్మానం


కరీముల్లాను సత్కరిస్తున్న సి.మల్లవరం ప్రజలు

తిరుపతి రూరల్: వైఎస్ఆర్ సీపీ మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడిగా ఎంపికైన షేక్ కరీముల్లాను ఆదివారం ఘనంగా సత్కరించారు. సి.మల్లవరం సర్పంచ్ మొక్కల భారతి తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. కేక్ కట్ చేసి స్థానికులకు పంచి పెట్టారు. చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి ఆశీస్సులతో తమకు పదవి వచ్చేందుకు సహకరించిన తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డికి, సి.మల్లవరం సర్పంచ్ మొక్కల భారతి తిమ్మారెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సేవాదళ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మొక్కల తిమ్మారెడ్డి, పంచాయితీ అధ్యక్షుడు సిద్ధారెడ్డి, ఉప సర్పంచ్ సానాజీ బేగం, వార్డు మెంబర్లు మహ్మద్ రఫీ, శంకర్, వెంకటయ్య, సుందరరామిరెడ్డి, కార్యకర్తలు మస్తాన్, సాహిల్, రజిత్, బారిషా, లాల్‌షా, ఈశ్వరయ్య, సిద్ధిక్ బాషా, లోకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

చంద్రగిరి: 32 సంవత్సరాల క్రితం 10వ తరగతి చదువుకున్న విద్యార్థులందరూ ఒక్కటయ్యారు. అనాడు చేసిన అల్లరి, తుంటరి పనులను ఒకరితో ఒకరు పంచుకున్నారు. ఇంతటి గొప్ప కార్యక్రమానికి తిరుచానూరు జెడ్పీ ఉన్నత పాఠశాల వేదికగా మారింది. ఆదివారం తిరుచానూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1993–94లో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చాలా ఏళ్ల తర్వాత కలుసుకున్న చిన్ననాటి మిత్రులు కలుసుకోవడం వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుల పాదాలకు పూజలు చేయడంతో పాటు వారిని ఘనంగా సత్కరించారు. పాఠశాల అభివృద్ధి కోసం ప్రత్యేక సంఘం ఏర్పాటు చేసుకున్నారు.

ఘనంగా రావూరి పుట్టినరోజు వేడుక


విద్యార్థిని మాధురిని అభినందిస్తున్న రావూరి వెంకటస్వామి

పుత్తూరు: శ్రీవెంకట పెరుమాళ్ ఇంజినీరింగ్ కళాశాల విద్యా సంస్థల చైర్మన్ రావూరి వెంకటస్వామి పుట్టినరోజు వేడుకలను ఆదివారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. పుట్టిన రోజు కార్యక్రమంలో ఆయన కేక్ కట్ చేశారు. అనంతరం కేక్‌ను కళాశాల సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ స్థాయిలో రెండో ర్యాంకు సాధించిన శ్రీవెంకట పెరుమాళ్ కళాశాల విద్యార్థిని జె.మాధురిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ రావూరి బాలాజీ, ప్రిన్సిపల్ సునీల్, గోపికృష్ణ, మేనేజ్‌మెంట్ మెంబర్ ప్రేమ్‌చంద్, వైస్ ప్రిన్సిపల్ రామ్ గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.